క్లుప్తంగా

పామాయిల్ తోటల సాగుకు ప్రోత్సాహం

సీతంపేట: పామాయిల్ తోటల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నట్టు హార్టికల్చర్ అధికారి పి.జయశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు ఉద్యానవన శాఖ కార్యాలయంలో సంప్రదించినట్లయితే పామాయిల్ మొక్కలను ఉచితంగా సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. తొలుత కొద్ది మంది రైతులను ఎంపిక చేసి మొక్కలు పంపిణీ చేయడం జరుగుతుందని, పంట సాగుకు తగిన ప్రోత్సాహం కూడా ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

చురుగ్గా సీసీ కాలువల నిర్మాణం



జేసీబీలో కాలువలు తవ్విస్తున్న దృశ్యం

భామిని: మండలంలోని పాత ఘనసర గ్రామంలోని అన్ని వీధుల్లో సీసీ కాలువల నిర్మాణం చేపడుతున్నట్టు సర్పంచ్ కిల్లారి కమల, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి కిల్లారి ఫాల్గుణరావు తెలిపారు. గ్రామంలోని డెప్పివీధిలో సీసీ కాలువల నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. జేసీబీ సాయంతో రోడ్డుకు ఇరువైపులా మట్టిని తవ్వి కాలువలు నిర్మిస్తున్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ఉల్లిభద్రలో ఈ-క్రాప్ నమోదు

గరుగుబిల్లి: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని మండల వ్యవసాయశాఖ అధికారి రేగిడి విజయభారతి సోమవారం తెలిపారు. ఉల్లిభద్ర గ్రామంలో ఈ-క్రాప్ నమోదును సోమవారం ఆమె పరిశీలించారు. రైతులు పండించిన పంటలను విక్రయించాలంటే విధిగా ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటనష్టం వాటిల్లితే నష్టపరిహారం పొందేందుకు ఈ-క్రాప్ అవసరమన్నారు. రైతులు ఆర్‌బీకేలకు వెళ్లి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు.

ఎరువుల గొడౌన్‌లో విజిలెన్స్ తనిఖీలు

సాలూరు: మండలంలోని బాగువలస గ్రామంలో సుతాపల్లి విజయ్‌నగేష్‌కు చెందిన ఎరువుల గొడౌన్‌లో విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా నిల్వచేసిన యూరియా, డీఏపీ, ఎంవోపీ ఎరువులను గుర్తించారు. వీటి విలువ దాదాపు రూ.1,73,243 ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ సింహాచలం, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ సింహాచలం, కానిస్టేబుల్ పురుషోత్తం, ఇన్‌చార్జ్ ఏవో తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న కాలనీల్లో గృహప్రవేశాలు

సీతానగరం: మండలంలోని జగనన్న కాలనీల్లో గృహప్రవేశాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారంతా శ్రావణమాసం కావడంతో మంచి ముహూర్తాలు చూసుకుని, గృహప్రవేశాలు చేస్తుండడం గమనార్హం. నిర్మాణాలు సగంలో ఉన్న వారు కూడా తమ నిర్మాణాలను వేగవంతం చేసి, ఇదే శ్రావణమాసంలో గృహప్రవేశాలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మండలంలోని జోగింపేట, బుడ్డిపేట, నిడగల్లు గుచ్చిమి, కాశీపేట, జానుమల్లువలస గ్రామాల్లో గృహప్రవేశాలు జోరుగా జరుగుతున్నాయి. సోమవారం ఏగోటివలస జగనన్న కాలనీలో ఎన్.శ్రీనివాసరావు దంపతులు జగనన్న ప్రభుత్వం ఇచ్చిన ఇంట్లోకి గృహప్రవేశం చేసి, ఆనందించారు.

ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేయాలి

సీతానగరం: ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఏవో ఎస్.అవినాష్ సూచించారు. సోమవారం మండలంలోని చినభోగిలి, ఆర్.వెంకంపేట, కాశీపేట గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదును పరిశీలించిన ఆయన నిర్దేశిత గడువులోగా ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే ఈ ప్రక్రియ వల్ల కలిగే ప్రయోజనాలను, ఖరీఫ్ సాగులో అధిక దిగుబడులకు మెలకువలను రైతులకు వివరించాలని తెలిపారు.

బలిజిపేట: రైతులు తాము పండిస్తున్న పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో శ్రావణ్ సూచించారు. మండలంలోని మిర్తివలస, బర్లి గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను సోమవారం పరిశీలించిన ఆయన ఈ-క్రాప్ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

విద్యార్థులకు జగనన్న దీవెన

నిరుపేద విద్యార్థుల చదువులకు జగనన్న విద్యా దీవెన పథకం ఆసరాగా నిలుస్తోందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్నత చదువులు అభ్యసించేందుకు అప్పులు చేయాల్సి వచ్చేదని, లేదంటే చదువులకు స్వస్తి చెప్పి కూలి పనులు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తుచేసుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలతో ప్రతీ పేద విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించేందుకు అవకాశం కలిగిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నగరి నియోజకవర్గంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మూడో విడత విద్యాదీవెన పథకాన్ని సోమవారం బటన్ నొక్కి ప్రారంభించారు. దీంతో విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుండడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాలకొండ నియోజకవర్గంలో నాలుగేళ్లలో మొత్తం 21,621 మంది విద్యార్థులకు, కురుపాం నియోజకవర్గంలో మొత్తం 21,669 మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందారు.

– సాక్షి నెట్‌వర్క్

పాలకొండ నియోజకవర్గంలో..

ఏడాది	విద్యార్థులు	నిధులు (రూ.కోట్లలో)
2019-20	4,556	8,12,47,131
2020-21	5647	7,49,56,509
2021-22	6137	9,99,18,248
2022-23	5271	5,67,61,733
మొత్తం	21,621	31,28,83,621

కురుపాం నియోజకవర్గంలో..

సంవత్సరం	విద్యార్థులు	జమైన మొత్తం (రూ.కోట్లలో)
2019-20	4315	81247131
2020-21	5840	81551532
2021-22	6094	107738311
2022-23	5420	58750250
మొత్తం	21669	329,287,224

సర్కారు తోడ్పాటుతో..



నా పేరు బొత్స ప్రియ. నా తండ్రి దామోదరరావు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. ఆయన అకాల మరణంతో మా కుటుంబ భారం నా అమ్మ పద్మావతిపై పడింది. ఈ క్రమంతో చదువుకోలవాలన్న నా ఆశలు సన్నగిల్లాయి. జగన్ మామ విద్యాదీవెన ద్వారా అందుతున్న మొత్తంతో పాలకొండలో ఓ ప్రైవేటు కళాశాలలో ఎంపీసీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. మావంటి విద్యార్థులకు సహకరిస్తున్న జగన్ మామకు నా కృతజ్ఞతలు.

– బొత్స ప్రియ, డిగ్రీ విద్యార్థిని, తుమరాడ, పాలకొండ మండలం

నా చదువుకు జగన్‌మామ సహకారం



నాపేరు హెప్సిబ. నేను సీతంపేట డిగ్రీ కళాశాలలో బీఏ స్పెషల్ ఇంగ్లిష్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. మాది రాజన్నగూడ గ్రామం. ఆదిమ గిరిజన నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు కొండపోడు పనులు చేసుకుని జీనవం సాగిస్తున్నాం. సీఎం జగన్ మామ అందిస్తున్న విద్యాదీవెన పథకం నా చదువుకు ఎంతో ఉపయోగపడుతోంది. నా చదువుకు సహకరించిన జగన్‌మామకు రుణపడి ఉంటా.

– సవర హెప్సిబ, రాజన్నగూడ, సీతంపేట మండలం

జగనన్న అండతో ఇద్దరు పిల్లలను చదివిస్తున్నా..



ఈ చిత్రంలో ఉన్న మహిళ పేరు లండ కమల. మండలంలోని కొండాపురంలో నివాసం ఉంటున్నారు. పెద్ద కుమారుడు సాయికుమార్ శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు కళాశాలలో పాలిటెక్నిక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కుమార్తె శాంతకుమారి పదో తరగతి చదువుతోంది. కుమారుడి చదువుకు జగనన్న విద్యా దీవెన నిధులు, కుమార్తె చదువుకు జగనన్న అమ్మఒడి నిధులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అత్త జయమ్మకు వైఎస్సార్ ఆసరా పథకం, మామ పట్టాభికి డప్పు కళాకారుల పింఛన్ అందుతుండడంతో ప్రస్తుతం ఇంటివద్దనే చిన్న కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. – లండ కమల, కొండాపురం, పాలకొండ

జగనన్నకు రుణపడి ఉంటాం

నా పేరు ముక్కు రాజ్‌కుమార్. మాది సింగన్నవలస గ్రామం. మా నాన్న 2011లో మరణించారు. అప్పటి నుంచి మా అమ్మ దేవికుమారి కూలి పనులు చేసుకుని నన్ను, నా చెల్లిని పెంచుతుంది. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మా ఇద్దరి చదువులు ఇబ్బందులు లేకుండా సాగుతున్నాయి. నేను రాజాం జీఎంఆర్‌లో బీటెక్ చదువుతున్నాను. జగనన్న విద్యాదీవెన పథకం కింద నాకు ప్రతీ ఏటా రూ.26,400 అందుతోంది. మా చెల్లి ప్రేమ కుమారి ఇంటర్ చదువుతోంది. మా చెల్లికి అమ్మఒడి పథకం అందుతోంది. మాకు ఇంత అండగా ఉన్న జగనన్నకు రుణపడి ఉంటాం.

– ముక్కు రాజ్‌కుమార్, సింగన్నవలస, బీటెక్ విద్యార్థి, పాలకొండ

విద్యాదీవెనతో ఉన్నత చదువు



భామిని మండలం నేరడి-బికి చెందిన ఈ విద్యార్థిని పేరు టంకాల ప్రవళిక. మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఈమె నాలుగేళ్ల క్రితం భామిని ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ బైపీసీ చేసింది. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు అమలు చేయడంతో బీ-ఫార్మసీ పూర్తి చేసింది. జగనన్న విద్యాదీవెనతో కళాశాల ఫీజు చెల్లింపునకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువు పూర్తిచేసినట్లు చెపుతోంది.

– టంకాల ప్రవళ్లిక, నేరడి-బి, భామిని మండలం

నా చదువు జగనన్న భిక్షే..



జగనన్న ప్రభుత్వం అందజేస్తున్న విద్యాదీవెనతో నా చెల్లి, నేను ఇంజినీరింగ్ చదువుతున్నాము. ప్రస్తుతం నేను విశాఖపట్నంలోని అవంతి కాలేజీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ చదువుతున్నాను. జగనన్న విద్యాదీవెన రాకపోతే ఇంజినీరింగ్ చదివేవాడిని కాదు. సీఎంకు రుణపడి ఉంటాను.

– బంటు పృథ్వీ, వెంకటరాజపురం, జియ్యమ్మవలస మండలం

పేద విద్యార్థుల చదువుకు భరోసా..



జగనన్న విద్యాదీవెన పథకం నాలాంటి నిరుపేద విద్యార్థుల చదువుకు ఎంతో భరోసానిస్తోంది. కురుపాంలోని వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ డిగ్రీ కళాశాలలో సెకండ్ ఇయర్ డిగ్రీ చదువుతున్నాను. పేద విద్యార్థులు పెద్ద చదువులు చదవాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగనన్న ఈ పథకం అమలు చేస్తుండడం చాలా సంతోషదాయకం. కళాశాలలో ఫీజులు చెల్లించేందుకు ఈ నగదు ఎంతగానో ఉపయోగపడింది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. – కోలక గణపతిరావు, డిగ్రీ విద్యార్థి, చినగీసాద, గుమ్మలక్ష్మీపురం మండలం

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా మా చదువుల కోసం ప్రతీ ఏడాది క్రమం తప్పకుండా జగనన్న విద్యాదీవెన ద్వారా నేరుగా ఖాతలో సొమ్ము జమ చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. ఆయన రుణం తీర్చుకోలేనిది. రాష్ట్రంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ.. మా వంటి పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగు నింపి చిరకాలం మా గుండెలో నిలచిపోతారు.

– పొడుగు హిమావంత్‌కుమార్, బీఏస్సీ ఫైనల్ ఇయర్, దుగ్గి గ్రామం, కొమరాడ మండలం

విద్యాదీవెనతోనే చదువుతున్నాను



జగనన్న విద్యాదీవెన కింద ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుండడంతో నేను విశాఖపట్నంలోని అవంతి కళాశాలలో బీ ఫార్మసీ చదవగలుగుతున్నాను. నాతో పాటు మా చెల్లి కూడా ఇంటర్ చదువుతోంది. జగనన్న విద్యాదీవెనతో కాలేజీ ఫీజుల కోసం మానాన్న ఎలాంటి ఇబ్బందులు పడకుండా మమ్మల్ని సంతోషంగా చదివిస్తున్నారు.

– నామగిరి ఝాన్సీ, దళాయిపేట, జియ్యమ్మవలస మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం



డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాను. డిగ్రీ చదువుతాను అనుకోలేదు. నా భర్త ప్రోద్బలంతో ఉన్నత చదువు కొనసాగిస్తున్నాను. పైసా ఖర్చులేకుండా చదువుతన్నానంటే జగనన్న అందజేస్తున్న విద్యాదీవెనే కారణం. జీవితాంతం జగనన్నకు రుణపడి ఉంటాను.

– లచ్చిరెడ్డి అఖిల, జియ్యమ్మవలస

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి



సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ రూరల్: ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం నాయకులు నినదించారు. మండలంలోని మల్లమ్మగూడలో సోమవారం సమరభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు డి.రమణారావు మాట్లాడుతూ.. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4 వరకు సమరభేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.మజ్జయ్య, భానుచంద్ర, మోహన్, సాంబమూర్తి, రమేష్, సింహాచలం తదితరులున్నారు.

ఆదివాసీ జేఏసీ వినతి



ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘ నాయకులు

సీతంపేట: గిరిజనులపై దాడులను నిరసిస్తూ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. సీతంపేట సంత మార్కెట్ నుంచి ఐటీడీఏ వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర శాంతియుతంగా ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. ఐటీడీఏ ముఖద్వారం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు బి.శ్రీనివాసరావు, హెచ్.ప్రసాదరావు, మోహనరావు మాట్లాడుతూ.. మణిపూర్‌లో గిరిజనులపై దాడులను ఖండిస్తున్నామన్నారు. స్థానికంగా గిరిజనేతరుడైన పి.లోకేశ్వరరావు ఇద్దరు గిరిజన మహిళా ఉపాధ్యాయులను కులం పేరుతో దూషించినందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేయాలన్నారు. కోర్టు తీర్పులు వెలువరించిన 29 ఎల్‌టీఆర్ కేసులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో 1/70, పీసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, జీఓ-3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ నాయకులు ఎం.రామారావు, కె.భాస్కరరావు, జాన్‌సింహాచలం, పి.పురుషోత్తం, ఎస్.కాంతారావు, బి.ఉమామహేశ్వరరావు, అజయ్‌కుమార్, డి.గణేష్, చంటి, ఎస్.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత



కొత్తగా ఎంపికైన వలంటీర్లకు నియామకపత్రాలు అందిస్తున్న ఎంపీపీ

వీరఘట్టం: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు సూచించారు. ఇటీవల కొత్తగా ఎంపికైన ఐదు గ్రామాలకు చెందిన వలంటీర్లకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, తలవరం సర్పంచ్ శిష్టు మధుసూదనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ శ్రీనివాసరావు, గుంట్రెడ్డి గౌరీశంకరరావు, ఆబోతుల దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి: పీఓ



భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న పీఓ విష్ణు చరణ్

కురుపాం: మండలంలోని మొండెంఖల్ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కార్యక్రమం కింద నిర్మిస్తున్న అదనపు భవనాలను పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ సోమవారం పరిశీలించారు. ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టాలని, సకాలంలో నిర్మాణాలు పూర్తిచేయాలని సూచించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వరరావు, ఏఈలు ఉన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బీమా డబ్బులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కురుపాం: మండలంలోని బియ్యాలవలస పంచాయతీ దురుబిలి గ్రామానికి చెందిన తోయక సుక్కయ్య కొద్దిరోజుల కిందట పార్వతీపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం వైఎస్సార్ బీమా కింద ఆర్థిక సాయం మంజూరు చేసింది. తక్షణ సాయంగా రూ.10 వేలును వైఎస్సార్‌సీపీ నాయకుడు శెట్టి నాగేశ్వరరావు, సర్పంచ్ అజ్జారి, మాజీ సర్పంచ్ పువ్వల పత్తి, పువ్వల వికాష్, తదితరులు సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కేవీకేని సందర్శించిన విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని టిక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కృషివిజ్ఞాన కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఫీల్డ్ ఎక్స్‌పోజర్ విజిట్ కార్యక్రమంలో భాగంగా ఆర్ట్స్ సంస్థ(యాక్షన్ ఇన్ రూరల్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్) ఆర్థిక సహకారంతో విద్యార్థులను ఫీల్డ్ విజిట్‌కు తీసుకువెళ్లారు. నూతన వ్యవసాయ పద్ధతులు, పండ్ల తోటల పెంపకం, ఇతర జీవనోపాధులు, రైతులకు అందిస్తున్న సేవలపై కేవీకే హార్టికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ జిల్లా కోఆర్డినేటర్ వై.దుర్గారావు, ఆర్ట్స్ సిబ్బంది చిరంజీవి, సూర్యం ఉన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల నిరసన



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రీన్‌అంబాసిడర్లు

పాలకొండ: గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం గ్రీన్ అంబాసిడర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ.. గ్రీన్ అంబాసిడర్లకు ఆరు నెలల నుంచి వేతనాలు చెల్లించక పోవడంతో వారంతా కుటుంబాలతో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రీన్‌అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు.

కలెక్టరేట్ వద్ద వీఆర్ఏల నిరసన రేపు

కురుపాం: ఈ నెల 30న వీఆర్‌ఏలు చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు గరుగుబిల్లి ఈశ్వరరావు కోరారు. ఈమేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 25న వీఆర్ఏల హక్కుల సాధన కోసం శాంతియుతంగా ధర్నా నిర్వహించేందుకు విజయవాడ వెళ్తున్న వీఆర్ఏలను అక్రమంగా అరెస్టు చేశారని వాపోయారు. వీఆర్ఏల సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 30న కలెక్టరేటు ఎదుట నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిరసనలో వీఆర్ఏలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నూతన కార్యవర్గ సభ్యులకు సన్మానం



చిరంజీవులు, గోపాలరావులను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

భామిని: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గంలో చోటు దక్కించుకున్న మండల నాయకులు కొవ్వాడ చిరంజీవులు, సోమరాజు గోపాలరావులను పార్టీ నాయకులు టింగ అన్నాజీరావు, బోదెపు శ్రీనివాసరావు, మజ్జి మోహనబాబు, బిడ్డిక విష్ణు, తదితరులు సోమవారం సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన చిరంజీవులను ప్రత్యేకంగా అభినందించారు. నూతన కార్యవర్గం నేతృత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తామన్నారు.

కృతజ్ఞతాపూర్వక కలయిక



ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిని కలిసిన నిమ్మల వెంకటరావు

కురుపాం: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఏఎంసీ మాజీ చైర్మన్, పార్వతీపురం మన్యం జిల్లా నూతన కార్యదర్శి నిమ్మల వెంకటరావు అన్నారు. చినమేరంగిలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి రుణపడి ఉంటానని, అందరి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని అన్నారు.

గిరిజన స్పందనకు 49 వినతులు



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఐటీడీఏలో సోమవారం జరిగిన గిరిజన స్పందనకు 49 వినతులు వచ్చాయి. ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి వినతులు స్వీకరించారు. కేరాసింగికి చెందిన రూప జీవనోపాధి కల్పించాలని కోరారు. పిండిమిల్లు ఏర్పాటుకు రుణం మంజూరు చేయాలని దుగ్గికి చెందిన విజయ, కుట్టుమిషన్ ఇప్పించాలని బూర్జమానుగూడకు చెందిన పి.పార్వతి, లోకండకు చెందిన కృష్ణారావు కంప్యూటర్‌కాటా మంజూరు చేయాలని వినతిపత్రాలు అందజేశారు. ఇసుక రవాణాకు అనుమతించాలని చాపరాయిగూడకు చెందిన శంకరరావు, పింఛన్ మంజూరు చేయాలని రేణుగూడకు చెందిన ఎస్.గౌరీష్, పంచాయతీ భవనం నిర్మించాలని పెద్దగూడ బాపయ్య అధికారులను కోరారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, పీఏఓ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోండి: డీఐఓ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఐఓ జగన్మోహనరావు

గరుగుబిల్లి:

గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా అందజేస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని చిలకాం పంచాయతీ దత్తివలస గ్రామంలో చేపట్టిన 'ఫ్యామిలీ డాక్టర్' వైద్యశిబిరాన్ని సోమవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 104 వాహనంలో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, రోగ నిర్ధారణ పరీక్షల కిట్లు, మందులను పరిశీలించారు. గర్భిణులకు 104 వైద్య సిబ్బంది నిర్వహించిన ఈసీజీ రిపోర్టును పరిశీలించారు. అనంతరం ఓపీలో నమోదు చేసిన రోగుల అనారోగ్య సమస్యలు, వారికి నిర్వహించిన పరీక్షలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. వివరాలను ఎఫ్‌డీపీ యాప్‌లో నమోదు చేయాలన్నారు. సీజనల్ జ్వరాలు గుర్తిస్తే వెంటనే తగిన చికిత్స అందించాలని సూచించారు.

కార్యక్రమంలో రావివలస పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అరుణకుమారి, సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది సోములమ్మ, దుర్గాభవానీ, 104 సిబ్బంది శివగణేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.